సాక్షి పల్నాడు
మంగళవారం । 30 । జనవరి । 2024



ఘనంగా రామయోగి స్వామి తిరునాళ్ల

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్లలో పొట్లపాడు రామయోగిస్వామి తిరునాళ్ల ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.



వీనుల విందుగా వేణుగాన కచేరి

పాత గుంటూరు: త్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో లక్ష్మీపురంలో త్యాగరాజ ఆరాధన మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం పలు కచేరీలు అలరించాయి.



దుర్గమ్మకు బంగారు గాజులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపైన కొలువైఉన్న దుర్గమ్మకు తాడేపల్లిగూడెంకు చెందిన భక్తులు సోమవారం బంగారు గాజులను కానుకగా సమర్పించారు.

మార్మోగిన సామాజిక నినాదం

సామాజిక సాధికార యాత్రకు పోటెత్తిన జనం

చిలకలూరిపేట సామాజిక జన సంద్రమైంది. పెద్దఎత్తున తరలివచ్చిన జనం సాధికార నినాదాన్ని చాటారు. గత పెత్తందారీ మనస్తత్వం గల పాలకులచే నిరాదరణకు, హేళనలకు, చిన్నచూపునకు గురైన వైనాన్ని.. నేడు తమకు అన్నివిధాలుగా ప్రాధాన్యతనిస్తున్న జగనన్న పాలనలో సగర్వంగా.. ఆత్మగౌరవంగా తలెత్తుకు తిరుగుతున్న వైనాన్ని పోల్చి చూస్తూ.. పదం పదం కలిపి కదం తొక్కారు. జై జగన్.. జైజై జగన్ అంటూ దిక్కులు పిక్కటిల్లేలా.. పెత్తందార్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తేలా నినదించారు.

- జనసంద్రమైన చిలకలూరిపేట
- సామాజిక సాధికారతను నలుదిశలా చాటిన పార్టీ శ్రేణులు
- మహనీయులకు నివాళులు.. పలు వర్గాల ఆత్మీయ సత్కారాలు
- యాత్రకు బ్రహ్మరథం పట్టిన ప్రజానీకం
- నాయకుల ప్రసంగాలకు జేజేలు



బస్సుపై నుంచి అభివాదం చేస్తున్న ఎంపీ విజయసాయిరెడ్డి, మంత్రి విడదల రజిని, సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు

చిలకలూరిపేట: సామాజిక చైతన్యం నినాదంతో చిలకలూరిపేట మార్మోగింది. ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో వివరించేందుకు.. సంక్షేమ ఫలాల లబ్ధిని తెలియజేసేందుకు.. సుపరిపాలనకు అండగా నిలిచేందుకు.. రాబోయే ఎన్నికల్లో ప్రజలకు మార్గదర్శనం చేసేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన సామాజిక సాధికార బస్సుయాత్రకు, బహిరంగ సభకు చిలకలూరిపేట ప్రజానీకం పోటెత్తింది. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో సోమవారం సామాజిక సాధికార బస్సుయాత్ర నిర్వహించారు. బడుగు, బలహీన వర్గాలతో పాటు బస్సు యాత్రకు ఇతర ఉన్నతవర్గాలు సైతం తరలిరావడంతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో ఉత్సాహం ఉప్పొంగింది. అంచనాలకు మించి జనం తరలి రావడంతో యాత్ర విజయవంతమైంది.

భారీగా ర్యాలీ..

బస్సుయాత్ర జాతీయ రహదారి పక్కన ఉన్న కొత్త వ్యవసాయ మార్కెట్ ప్రాంగణం నుంచి భారీ ర్యాలీగా కోయ నృత్యాలు, కేరళ సాంప్రదాయ నృత్యాలు, తీన్‌మార్ డోలక్ వాయిద్యాలతో సంబరంగా కొనసాగింది. యాత్రలో వైఎస్సార్ సీపీ జాతీయ కార్యదర్శి, రాజ్యసభలో పార్లమెంటరీ పార్టీ నేత వేణుంబాక విజయసాయిరెడ్డి, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, పార్టీ గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల రీజినల్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు పాల్గొన్నారు.

మహనీయులకు నివాళులు...

తొలుత ఎన్ఆర్‌టీ సెంటర్‌కు చేరుకుని అక్కడ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి క్రేన్ సహాయంతో గజమాల వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి భాస్కర్ సెంటర్‌కు చేరుకుని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే సోమేపల్లి సాంబయ్య విగ్రహాలకు నివాళులర్పించారు. తదుపరి అమరజీవి పొట్టి శ్రీరాములు, డాక్టర్ ఎస్.జాన్‌డేవిడ్ విగ్రహాలకు నివాళులర్పించారు. చౌత్రా సెంటర్లో ఆర్యవైశ్యులు, రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద ముస్లిం, ఎస్సీ వర్గీయులు యాత్రలో పాల్గొన్న నాయకులకు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. అక్కడినుంచి కళామందిర్ సెంటర్లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభ వద్దకు నాయకులు చేరుకున్నారు.



మహానేత వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మల్లెల రాజేష్‌నాయుడు, మంత్రి రజిని, ఎంపీ విజయసాయి రెడ్డి

అక్కడ సభ వేదిక పై నుంచి మంత్రి విడదల రజిని, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా, ఎమ్మెల్సీలు చంద్రగిరి ఏసురత్నం, కుంభా రవిబాబు ప్రసంగించారు. నాయకుల ప్రసంగాలకు ప్రజలు హర్షధ్వానాలు పలికారు.

జగనన్న సంకల్పం గొప్పది...

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం కల్పించాలన్న జగనన్న సంకల్పం గొప్పదని కొనియాడారు. గతంలో ఎవరైతే ముఖ్యమంత్రిగా ఉంటారో ఆ సామాజిక వర్గం వారికి మాత్రమే పరిపాలనలో అధికశాతం వాటా దక్కేదని, అందుకు భిన్నంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు పరిపాలనలో సముచిత స్థానం కల్పిస్తున్నారని పేర్కొన్నారు. జగనన్న పాలనలో సొంత ఆస్తి లేని వారంటూ లేరన్నారు. జగనన్న కాలనీల పేరున రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిమందికి ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇచ్చి ఆస్తిహక్కు కల్పించారని కొనియాడారు. ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ చక్రవర్తి, స్టేట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నాగార్జున యాదవ్, మైనార్టీ కార్పొరేషన్ రీజినల్ కో–ఆర్డినేటర్ షేక్ హుస్సేన్, కృష్ణబలిజ, పూసల బలిజ కార్పొరేషన్ చైర్మన్ కోలా భవాని, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, రాష్ట్ర ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ దరియావలి, పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ అల్లీమియా, ఎంపీపీలు పిడతల ఝాన్సీ, తలతోటి రాణి, నాయకులు పాల్గొన్నారు.

'సాధికార' సైడ్‌లైట్స్...

- సామాజిక సాధికార బస్సుయాత్ర కార్యక్రమంలో భాగంగా జాతీయ రహదారి పక్కన ఉన్న చిలకలూరిపేట కొత్త వ్యవసాయ మార్కెట్ యార్డు వద్దకు వైఎస్సార్ సీపీ జాతీయ నాయకులు, రాజ్యసభ సభ్యులు వేణుంబాక విజయసాయిరెడ్డి, మంత్రి విడదల రజిని, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, కుంభా రవిబాబు, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడులు మధ్యాహ్నం 3.50 గంటలకు చేరుకున్నారు.
- సాయంత్రం 4 గంటల నుంచి 4.45 వరకు వివిధ వర్గాలకు చెందిన తటస్థులతో సమావేశం నిర్వహించారు.
- సాయంత్రం 4.50 గంటల నుంచి 5.05 వరకు విలేకర్ల సమావేశం నిర్వహించారు
- సాయంత్రం 5.15 గంటల నుంచి బస్సు యాత్ర ప్రారంభమై సాయంత్రం 6.40కు పట్టణంలోని కళామందిర్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ వేదిక వద్దకు చేరుకుంది.
- బహిరంగ సభ సాయంత్రం 6.50 గంటలకు ప్రారంభమై రాత్రి 7.50 గంటల వరకు కొనసాగింది.

న్యూస్‌రీల్

నేటి నుంచి జగనన్న స్థలాల రిజిస్ట్రేషన్లు



గుంటూరు వెస్ట్ : నవరత్నాలు – పేదలందరికీ ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లను మంగళవారం నుంచి అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. స్థానిక కలెక్టరేట్ నుంచి సోమవారం వర్చువల్ విధానంలో అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1.43 లక్షల ఇళ్ల పట్టాలు అందజేశామన్నారు. నిర్దేశించిన సచివాలయం క్లస్టర్లలో పట్టాలున్న అందరికీ రిజిస్ట్రేషన్లు చేయాలన్నారు. రిజిస్ట్రేషన్‌కు సంబంధించి హద్దులు, మ్యాపింగ్ పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు. వచ్చే నెల 9 నాటికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొత్తం పూర్తి చేసేందుకు కావాల్సిన సిబ్బంది, కంప్యూటర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్లకు వచ్చే వారితో మర్యాదగా వ్యవహరించాలన్నారు. సిబ్బంది కొంత ఎక్కువ పని చేయాల్సి ఉంటుందని, దీనిని బాధ్యతగా భావించాలని తెలిపారు. కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, అధికారులు పాల్గొన్నారు.

ఖరీఫ్, రబీ పంట రుణాలకు నిర్దిష్ట విధానాలు

గుంటూరు వెస్ట్ : ఈ ఏడాది ఖరీఫ్ సహా రానున్న రబీకి పంట రుణాలు అందించేందుకు నిర్దిష్ట విధానాలు అమలు చేయాలని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన టెక్నికల్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ టెక్నికల్ కమిటీ నిర్ణయం మేరకు రుణాలు అందించాలన్నారు. రైతులకు ఇబ్బంది రాకుండా అన్ని రకాల పంటలతోపాటు కౌలు రుణాలు అందించాలన్నారు. సమావేశంలో ఎల్‌డీఎం మహీపాల్ రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు, జీడీసీసీ బ్యాంకు సీఈఓ కృష్ణవేణి, అధికారులు పాల్గొన్నారు.

యార్డుకు 1,05,823 బస్తాల మిర్చి




కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,05,823 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 98,079 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.20,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 21,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 67,096 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

నేడు జెడ్పీలో భేటీ కానున్న స్థాయీ సంఘాలు

గుంటూరు ఎడ్యుకేషన్ : ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘాలు మంగళవారం ఉదయం 10 గంటలకు జెడ్పీ కార్యాలయంలో భేటీ కానున్నాయి. ఈ సందర్భంగా ప్రణాళిక–ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, విద్య–వైద్యం, అభివృద్ధి పనులకు సంబంధించిన 1, 2, 4, 7వ స్థాయీ సంఘ సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరగనున్నాయి. అదే విధంగా వ్యవసాయంపై 3వ స్థాయీ సంఘం జెడ్పీ వైస్ చైర్మన్ శొంటిరెడ్డి నర్సిరెడ్డి, స్త్రీ–శిశు సంక్షేమంపై 5వ స్థాయీ సంఘం తెనాలి జెడ్పీటీసీ పిల్లి ఉమా ప్రణతి, సాంఘిక సంక్షేమంపై 6వ స్థాయీ సంఘం జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనురాధ అధ్యక్షతన జరగనున్నాయి. స్థాయీ సంఘ సమావేశాలకు ఆయా సంఘాల సభ్యులతో పాటు మూడు జిల్లాల పరిధిలోని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కావాలని సీఈవో జె.మోహనరావు సూచించారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 520.20 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 22,736, ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 822.80 అడుగుల వద్ద ఉంది.

అంగరంగ వైభవంగా రథోత్సవం



కల్యాణ తంతు నిర్వహిస్తున్న త్రిదండి చినజీయర్ స్వామి



రథ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు



రథమహోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: ప్రసన్నాంజనేయస్వామివారి రథోత్సవం సోమవారం అంగరంగ వైభవపేతంగా జరిగింది. 17వ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారి ఉత్సవ విగ్రహాలను, రథాన్ని పట్టణంలోని మెయిన్ బజారులో ఊరేగింపు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తుల దర్శనార్థం ఉంచారు. అంతేకాకుండా పంచముఖ ప్రసన్నాంజనేయ స్వామివారికి కలశాలతో అభిషేకాలు నిర్వహించారు. పట్టణంలోని ప్రజాశక్తి నగర్‌లో వేంచేసియున్న ప్రసన్నాంజనేయస్వామివారి ఆలయం వద్ద సీతారాముల వారి ఉత్సవ విగ్రహాలకు కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణ మహోత్సవాన్ని సమతామూర్తి స్ఫూర్తి కేంద్రస్థాపకులు త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి చేతుల మీదుగా ఘనంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల ఆవరణల్లో సుమారు 70 వేల మందికి పైగా మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రథ మహోత్సవం....

స్వామివారి రథమహోత్సవం, కల్యాణ మహోత్సవంలో గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. దేవాలయ కమిటీ సభ్యులు, పూజారులు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి ఆహ్వానం పలికారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేసి స్వామివారి రథాన్ని లాగి రథమహోత్సవాన్ని ప్రారంభించారు. వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి రథాన్ని లాగారు. పిడుగురాళ్ల పట్టణ సీఐ ఆంజనేయులు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది బందోబస్తు పర్యవేక్షించారు.

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం

206 అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్, జేసీ



అర్జీలు పరిశీలిస్తున్న కలెక్టర్ ఎల్.శివశంకర్

నరసరావుపేట: కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ ఎల్.శివశంకర్ అధ్యక్షతన నిర్వహించిన జగనన్నకు చెబుదాం స్పందనలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలచే 206 అర్జీలను స్వీకరించారు. ఆ అర్జీలను ఆయా శాఖలకు అందిస్తూ త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని సూచించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులకు జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో అన్నదానం నిర్వహించారు. నరసరావుపేటకు చెందిన బీవీ నాగేశ్వరరావు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి రూ.11వేల చెక్కును కలెక్టర్‌కు అందజేశారు. కలెక్టర్‌తో పాటు జేసీ ఎ.శ్యాం ప్రసాదు, డీఆర్‌ఓ కె.వినాయకం అర్జీలను స్వీకరించారు. జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కులగణన, ఇళ్లపట్టాల రిజిస్ట్రేషన్ లక్ష్యాలను పూర్తి చేయండి..

నరసరావుపేట: మండల ప్రత్యేక అధికారులు కులగణనపై దృష్టి సారించి త్వరితగతిన లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో జిల్లా అధికారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. నవరత్నాలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదలందరికీ ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియపై మండల పత్యేక అధికారులు దృష్టిపెట్టి రానున్న అయిదు రోజులలో పూర్తయ్యేలా చూడాలని, పల్నాడు జిల్లాను రాష్ట్రంలో ముందు వరుసలో ఉంచాలని అన్నారు. జేసీ ఎ.శ్యాంప్రసాద్, డీఆర్‌ఓ వినాయకం పాల్గొన్నారు.

మరణం లేని మహాకవి వేటూరి

విజయవాడ కల్చరల్: మరణంలేని మహాకవి వేటూరి సుందరరామమూర్తి అని సినీ మాటల రచయిత బుర్రా సాయి మాధవ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ, గీతాంజలి మ్యూజిక్స్, దామోదరం జానపదం, సుశీల్ మీడియా ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో సోమవారం వేటూరి 89 జయంతి కార్యక్రమం నిర్వహించారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న బుర్రా సాయి మాధవ్ మాట్లాడుతూ తెలుగు వారున్నంత వరకు వేటూరి పాట ఉంటుందన్నారు.

రాష్ట్రంలో జనరంజక పాలన

- మంత్రి అంబటి రాంబాబు
- మాదలలో వెల్‌నెస్ సెంటర్ ప్రారంభం



మాదలలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

మాదల(ముప్పాళ్ళ): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జనరంజకమైన పాలన అందిస్తూ ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం ఏర్పరచుకున్నారని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. మండలంలోని మాదల గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, వెల్‌నెస్ సెంటర్‌తో పాటు సహకార సంఘం ఆధ్వర్యంలో నాబార్డు నిధులతో నిర్మించిన 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదామును సోమవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పాలన అందించామని, గత ప్రభుత్వ పాలనకు ఇప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు బేరీజు వేసుకోవాలని కోరారు. మంచి పనులు చేస్తే ప్రజల ఆదరణ ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. రాష్ట్రంలో విప్లవాత్మకమైన మార్పులు గ్రామాల్లో తీసుకువచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలన్నారు. చంద్రబాబునాయుడు మోసపూరిత హామీలతో మళ్లీ మీ ముందుకు వస్తున్నాడని, ఒక్కడిలా కాకుండా గుంపులుగా వచ్చినా జగన్‌మోహన్‌రెడ్డి విజయాన్ని ఎవరూ ఆపలేరన్నారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మీ అందరి ఆశీస్సులు కావాలన్నారు. మేలు చేశాము కాబట్టే మరలా ఓటు వేయండని మీ ముందుకు వస్తున్నామన్నారు. చంద్రబాబుకు గానీ, పవన్‌కళ్యాణ్‌కు గానీ సీఎం వైఎస్ జగన్‌లాగా ఒంటరిగా పోటీ చేసే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. వంద మంది చంద్రబాబులు, వెయ్యిమంది పవన్‌కల్యాణ్‌లు కలిసి వచ్చినా ఓడించే సత్తా ఎవరికీ లేదన్నారు. మీ అందరి అండదండలతో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలుపించుకుందామన్నారు.

11 మైనార్టీ కుటుంబాలు చేరిక...

గ్రామంలోని ముస్లిం కాలనీకి చెందిన 11 కుటుంబాలవారు వైఎస్సార్ సీపీ నాయకుడు యలవర్తిపాటి సైదా ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీని వీడి మంత్రి అంబటి రాంబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. షేక్ అమీన్‌షా, షేక్ దమ్మాలపాటి సైదా, సయ్యద్ రఫీ, సయ్యద్ అక్బర్, యలవర్తిపాటి మోదిన, మాబుసుబాని, చాగంటివారిపాలెం గ్రామానికి చెందిన అన్నపురెడ్డి వెంకటరంగారెడ్డిలతో పాటు పలువురు పార్టీలో చేరినవారిలో ఉన్నారు. జీడీసీసీ చైర్మన్ రాతంశెట్టి రామాంజనేయులు(లాలుపురం రాము), గుంటూరు మార్కెట్ యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, సర్పంచ్ కోటేశ్వరమ్మ, ఉపసర్పంచ్ చిమటా శ్రీనివాసరావు, ఎంపీటీసీ గోగుల అంజిబాబు, పక్కాల సూరిబాబు, పార్టీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షులు అన్నపురెడ్డి సాయిరెడ్డి, ఇందూరి వెంకటరెడ్డి, తిరుమలశెట్టి అయ్యప్ప, వైఎస్సార్ సీపీ నాయకులు ఎంజీఎం రామలింగారెడ్డి, రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, శిరిగిరి గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్రీడల్లో రాణిస్తే ఉన్నత భవిష్యత్



సత్తెనపల్లి: విద్యతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉన్నతమైన భవిష్యత్‌తో పాటు కుటుంబ సభ్యులకు, పుట్టిన ప్రాంతానికి, రాష్ట్రానికి, దేశానికి కీర్తి ప్రతిష్టలు లభిస్తాయని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సోమవారం నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్ర' నియోజకవర్గస్థాయి బాల,బాలికల క్రికెట్ పోటీల్లోని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు, క్రీడాకారిణిలను అభినందించి ట్రోఫీలను, ప్రశంసా పత్రాలను అందజేశారు. 'ఆడుదాం ఆంధ్ర' నియోజకవర్గ స్థాయి క్రికెట్ క్రీడా పోటీల్లో బాలుర విభాగంలో ప్రథమ స్థానం సత్తెనపల్లి, ద్వితీయ స్థానం నకరికల్లు, తృతీయ స్థానం రాజుపాలెం కైవసం చేసుకున్నాయి. బాలికల విభాగంలో ప్రథమ స్థానం ముప్పాళ్ళ, ద్వితీయ స్థానం సత్తెనపల్లి, తృతీయ స్థానం రాజుపాలెం కైవసం చేసుకున్నాయి. కార్యక్రమంలో గుంటూరు మిర్చియార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగూర్ మీరాన్, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, ఎంపీడీవో జీవీ సత్యనారాయణ, మండల చీఫ్ కోచ్ ఆరిక శ్రీరామిరెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, నాయకులు ఆకుల రమేష్, లోక మాధవ, సంకుల తిరుమలరావు, ముదినేడి సుబ్బయ్య పాల్గొన్నారు.

మొదటి ప్రాధాన్యం ఫిర్యాదుల పరిష్కారానికే ఇవ్వండి

- సిబ్బందికి ఎస్పీ దిశ నిర్దేశం
- జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి విశేష స్పందన



స్పందనలో ఫిర్యాదులను ఆలకిస్తున్న ఎస్పీ రవిశంకర్ రెడ్డి

నరసరావుపేట: జగనన్నకి చెబుదాం కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో పాల్గొని కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాలు, ఉద్యోగ మోసాలకు చెందిన సమస్యలకు సంబంధించి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదుదారుని సమస్య పట్ల శ్రద్ధ వహించి, నిర్ణీత గడువులోగా సదరు ఫిర్యాదులను పరిష్కరించడానికి కృషి చేయాలని సూచించారు. అదనపు అడ్మిన్ ఎస్పీ ఆర్. రాఘవేంద్ర, ఏఆర్ అదనపు ఎస్పీ డి. రామచంద్ర రాజు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

స్థలం నాకు విక్రయించి మరొకరికి అమ్మాడు!

గ్రామానికి చెందిన కోటేశ్వరరావు అనే వ్యక్తి వద్ద ఆరుసెంట్ల ఇంటి స్థలం కొనుగోలు చేశా. ఇల్లు కట్టుకుందామని చూడగా ఆవ్యక్తి మరొకరికి కూడా స్థలం అమ్మాడు. అదేమని అడిగితే నీకు దిక్కున్న చోట చెప్పుకోమంటున్నాడు. నా డబ్బులు నాకు ఇవ్వమంటే ఇవ్వకుండా బెదిరిస్తున్నాడు. నాకు నా డబ్బులు ఇప్పించి న్యాయం చేయండి.

–ఓ మహిళ, సొలస, యడ్లపాడు మండలం

సగం డబ్బులిచ్చి మోసం చేశాడు

నాతో పాటు మరికొంత మంది పండించిన మిర్చిని నాగేశ్వరరావు అనే వ్యాపారికి రూ.35 లక్షలకు విక్రయించాం. మాకు రూ.13 లక్షలిచ్చి రూ.22 లక్షలు తర్వాత ఇస్తానని ఇవ్వకుండా మోసం చేశాడు. మాకు డబ్బులు ఇప్పించి న్యాయం చేయండి.

–చిన అంకయ్య, లచ్చంబావి, మాచర్ల మండలం

ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు కాజేశారు

మూడేళ్ల క్రితం ఓ మహిళ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి ఇద్దరు మహిళల వద్ద రూ.30 వేలు తీసుకుంది. అప్పటి నుంచి ఉద్యోగం ఇప్పించకుండా, డబ్బులు ఇవ్వకుండా మోసం చేసింది. మాకు ఆ డబ్బులు ఇప్పించండి.

–ఓ మహిళ, రాజుపాలెం

మిర్చి యార్డులో ఫలహార, భోజన పథకం ప్రారంభం

ప్రారంభించిన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



రైతులకు అల్పాహారం వడ్డిస్తున్న మంత్రి అంబటి రాంబాబు, నిమ్మకాయల రాజనారాయణ

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డులో రైతు ఉచిత ఫలహారం, భోజన పథకాన్ని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సోమవారం ప్రారంభించారు. అనంతరం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే రైతుల కోసం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా, లేళ్ల అప్పిరెడ్డి యార్డు చైర్మన్‌గా ఉన్న సమయంలో వచ్చిన ప్రతి రైతుకు ఉచిత భోజనం పెట్టాలని నిర్ణయించుకున్నారని, అప్పటి నుంచి ప్రతి ఏడాది సంప్రదాయ పద్ధతిలో ఉచిత భోజనం కొనసాగిస్తూ వస్తున్నారని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉచిత భోజనం మాత్రమే కాదని, అల్పాహారం కూడా అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన రుచికరమైన అల్పాహారం, భోజనం అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి రోజు మెనూ ప్రకారం భోజనంతోపాటు కోడి గుడ్డు కూడా రైతులకు అందిస్తామని తెలిపారు. మార్కెట్ యార్డు ఉన్నతశ్రేణి ఇన్‌ఛార్జి కార్యదర్శి, మార్కెటింగ్‌శాఖ రీజనల్ సంయుక్త సంచాలకులు కాకుమాను శ్రీనివాసరావు మాట్లాడుతూ యార్డు పాలకవర్గం, యార్డు ఉద్యోగులు, సిబ్బంది, ఎగుమతి, దిగుమతి వ్యాపారుల సమన్వయంతో దేశంలోనే గుంటూరు మార్కెట్ యార్డును ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం మంత్రి అంబటి రాంబాబును యార్డు పాలకవర్గం, అధికారులు సత్కరించి, మెమోంటో అందజేశారు. కార్యక్రమంలో మార్కెటింగ్‌శాఖ మరో జాయింట్ డైరెక్టర్ రాజశేఖర్, ఏడీఎం బి.రాజబాబు, యార్డు డైరెక్టర్లు బందలపాటి వెంకటేశ్వరరావు, ఇంద్ర, వ్యవసాయ మార్కెట్ కమిటీల అధికారుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భాస్కరరెడ్డి, యార్డు అధికారులు శివారెడ్డి, సుబ్రమణ్యం, శ్రీకాంత్, మిర్చి దిగుమతి వ్యాపారుల సంఘం అధ్యక్షుడు లేళ్ల పెద అప్పిరెడ్డి, ఎగుమతి వ్యాపారుల సంఘం నాయకులు సాంబశివరావు, కె.సుధాకర్, రామకృష్ణ, శ్రీనివాసరావు, పెద్ద ఎత్తున మిర్చి రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

సఫాయి కర్మచారులకు పథకాలు, నిధులు అందాలి

- కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశం
- పదిమంది కర్మచారులకు బండ్లు అందజేత



బల్లబండ్లు అందజేసిన కలెక్టర్, జాయింట్ కలెక్టర్

నరసరావుపేట: సఫాయి కర్మచారులకు ప్రభుత్వ పథకాలు, నిధులు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎల్.శివశంకర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ (డీబీఆర్సీ) ఆర్థిక సహకారంతో పది మంది సఫాయి కర్మచారులకు బల్లబండ్లు పంపిణీ చేశారు. సఫాయి కర్మచారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే స్పందించిన కలెక్టర్ ఎస్సీ, ఎస్టీల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, నిధులు వీరికి అందే విధంగా చూడాలని అధికారులను కోరారు, ఈ కుటుంబాల పూర్తి సమాచారం సేకరించి సమస్యల పరిష్కార మార్గానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. డీబీఆర్సీ ఉచితంగా ఇచ్చిన బండ్లను చెత్తను సేకరించడానికి కాకుండా ప్రత్యామ్నాయ జీవనోపాదులకు ఉపయోగించాలని సూచించారు. ఆరోగ్యాన్ని పాడు చేసే వృత్తిని మానుకుని గౌరవప్రదమైన వృత్తులను చేపట్టాలన్నారు. ఇటువంటి వారి కోసం కృషి చేస్తున్న సంస్థ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ అల్లడి దేవకుమార్, ప్రాజెక్ట్ మేనేజర్ శామ్యూల్ అనిల్‌కుమార్‌లను కలెక్టర్ అభినందించారు.

అల్లడి దేవకుమార్ మాట్లాడుతూ సఫాయి కర్మచారులకు డీబీఆర్సీ నిర్వహిస్తున్న ఆరోగ్య, పరిశుభ్రత, సంక్షేమ పథకాలపై సదస్సులు, ప్రత్యామ్నాయ జీవనోపాదులపై శిక్షణ తరగతులు, వారి పిల్లల విద్యకోసం అవుట్‌డోర్ లెర్నింగ్ సెంటర్లు వంటి వివిధ కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ సహాయ సహకారాలు కూడా వీరికి అందే విధంగా చూడాలని కలెక్టర్‌ను కోరారు, ప్రాజెక్ట్ మేనేజర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ గుంటూరులోని నాయుడుపేటలో ఉన్న సఫాయి కర్మచారుల పిల్లల విద్యకోసం ప్రభుత్వ అధికారులతో మాట్లాడి అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేశామని తెలియజేశారు, ఇటువంటివారు ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాలను పొందేందుకు కావలసిన గుర్తింపు కార్డులు పొందే విషయంలో కూడా సహకరిస్తున్నామన్నారు., వీరి పిల్లలు చెత్తను సేకరించే వృత్తికి వెళ్లకుండా బాల్యవివాహాలు చేసుకోకుండా ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో చేర్పిస్తున్నామన్నారు. జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ బాలు నాయక్, డీబీఆర్సీ, ప్రోగ్రాం మేనేజర్ చుక్కా శామ్యూల్, రీజనల్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప, సిటీ కోఆర్డినేటర్ వేణు పాల్గొన్నారు.

నిందారోపణలు చేయడం తగదు

- ఎమ్మెల్యే శంకరరావుపై తప్పుడు మాటలు మాట్లాడితే సహించం
- కంచేటిని హెచ్చరించిన పెదకూరపాడు వైఎస్సార్ సీపీ నాయకులు



అచ్చంపేటలో విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అచ్చంపేట: 'స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మచ్చలేని నాయకుడు.. ఆయనపై నిందారోపణలు చేస్తే ప్రజలు తరిమి తరిమికొడతారు.. స్థాయి మరచి ప్రవర్తిస్తే మళ్లీ జైలుపాలవ్వక తప్పదని' వైఎస్సార్ సీపీ నుంచి బహిష్కరణకు గురైన కంచేటి సాయిబాబును వైఎస్సార్ సీపీ నాయకులు హెచ్చరించారు. సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో మండల పార్టీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య మాట్లాడుతూ ఇంతవరకు ఏ ప్రభుత్వంలోనూ సాధ్యం కాని అమరావతి– బెల్లంకొండ ట్రిబుల్ నిర్మాణాన్ని కూడా రాజకీయం చేస్తే సహించేది లేదన్నారు. టీడీపీ ప్రభుత్వంలో కేవలం సింగిల్ రోడ్డుకే రూ.83 కోట్లకు టెండర్లు వేశారని, నిర్మించడం మీకు చేతకాకపోవడంతో ట్రిబుల్ రోడ్డు నిర్మాణానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేత శంకుస్థాపన చేయించిన ఎమ్మెల్యే శంకరరావుపైనే విమర్శలు చేయడం తగదన్నారు.

ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్ మాట్లాడుతూ ఎమ్మెల్యేపై వ్యక్తిగత దూషణలకు పాల్పడటం మానుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు మొత్తం వైఎస్సార్ సీపీకి అండగా ఉన్నాయని, పెదకూరపాడు నియోజకవర్గంలో మళ్లీ శంకరరావును అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. నిన్న ఎమ్మెల్యే సచ్చీలుడనీ, నేడు పార్టీ మారిన వెంటనే ఎమ్మెల్యే అవినీతి పరుడు ఎలా అవుతారో చెప్పాలన్నారు. టీడీపీ ప్రభుత్వం రౌడీషీటర్ కేసు నమోదు చేస్తే వైఎస్సార్ సీపీ పంచన చేరి ఎమ్మెల్యే శంకరరావు దయాదాక్షిణ్యాలతో కేసు నుంచి బయటపడిన విషయం సాయిబాబు గుర్తుంచుకోవాలన్నారు.

పెదకూరపాడు నియోజకవర్గంలో జరిగే ఇసుక త్రవ్వకాలను, ఎమ్మెల్యే శంకరరావుకు ఏమైనా సంబంధం ఉందా.. ఇసుక అమ్మకాలు స్టేట్‌పాలసీ అని తెలియదా అని దుయ్యబట్టారు. గతంలో టీడీపీలో ఉన్న కంచేటి సాయిబాబును వాళ్లు తరిమికొడితే వైఎస్సార్ సీపీలో చేరాడని, మళ్లీ వైఎస్సార్ సీపీ వాళ్లు నీ దుర్మార్గపు పనులు సహించలేక పార్టీ నుంచి బహిష్కరించి తరిమికొట్టడంతో టీడీపీ నాయకులు కాళ్లుపట్టుకున్నాడన్నారు. మళ్లీ వాళ్లు కూడా తరిమికొట్టడం ఖాయమన్నారు.

పెదకూరపాడు నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే శంకరరావు, వారి కుటుంబ సభ్యులు అహర్నిశలు ప్రజలలో ఉంటూ ఎవరికి ఏంకావాలో తెలుసుకుంటూ వారి అవసరాలు తీరుస్తున్నారని చెప్పారు. అలాంటి కుటుంబంపై నిందారోపణలు చేస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సీహెచ్ ఎస్సార్కే సాయి రెడ్డి, లీడ్‌క్యాప్ డైరెక్టర్ ఎక్కిరాల మురళి, వైస్ ఎంపీపీ గంగసాని బాబు, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ అంబటి నారాయణ, మాదిపాడు ఎంపీటీసీ రమేష్ నాయక్, సొసైటీ అధ్యక్షులు రామిశెట్టి రంగయ్య, సర్పంచ్ కంబాల వీరబాబు, మాజీ సర్పంచులు తుమ్మా చిన్నప రెడ్డి, వాశిరెడ్డి వెంకటేశ్వర రావు, మచ్చా శ్రీనివాసరావు, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి సాతర్ల శ్రీనివాస రావు మైనార్టీ నాయకులు కమల్ సైదా, బీరువాల జాని, కాపు నాయకులు గోపీ, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు దేవరశెట్టి శ్రీనివాస రావు, ఎంపీటీసీ యండ్రపల్లి నటరాజు, సొసైటి మాజీ అధ్యక్షుడు రామిశెట్టి చిన్న యల్లమందయ్య, సచివాలయాల కన్వీనర్ రామకృష్ణా రెడ్డి, ముప్పా సాంబశివరావు, దళిత నాయకులు సందెపోగు సంసోను, సందెపోగు పున్నారావు పాల్గొన్నారు.

కంది పంట దిగుబడులు ఆశాజనకం

- ఎకరానికి 7 నుంచి 8 క్వింటాళ్ల వరకు దిగుబడి
- ఆర్బీకేల ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు
- వ్యవసాయ అధికారి పల్లపోతుల ప్రవీణ్

శావల్యాపురం: ఈఏడాది ఖరీఫ్–రబీ సీజనుల్లో సాగు చేసిన కంది పంట ఆశాజనకంగా ఉందని మండల వ్యవసాయ అధికారి పల్లపోతుల ప్రవీణ్ అన్నారు. సోమవారం మండలంలోని పోట్లూరు గ్రామంలో కంది పంటను వ్యవసాయ అధికారులు పరిశీలించారు. 15 గ్రామపంచాయతీల్లో 2169 ఎకరాలు కంది పంట సాగు చేయగా అత్యధికంగా మండలంలోని కారుమంచి, పోట్లూరు, కనమర్లపూడి తదిర గ్రామాల్లో కంది పంటను రైతులు సాగు చేశారని వివరించారు. కంది పంట ఆశాజనకంగా ఉందని ఒక్కో ఎకరానికి 7 నుంచి 8 క్వింటాల వరకు దిగుబడులు వస్తాయన్నారు. ఖరీఫ్ సీజనులో సాగు చేసిన కంది పంటను ప్రభుత్వం క్వింటా మద్దతు ధర 9445 రూపాయలకు నేరుగా రైతుభరోసాల ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా గోనెసంచులు కూలీల ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. దళారులు నుంచి రైతుల మోసపోకుండా ఉండటానికి ధర ముందుగానే ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు కొనుగోలు చేస్తామని, అమ్మిన కందుల నగదు నేరుగా రైతు బ్యాంకు ఖాతాలో వారం రోజుల వ్యవధిలో జమ చేయటం జరుగుతుందన్నారు.

పథకం ప్రకారమే టీడీపీ రౌడీ మూకల దాడి

తొండపి ఘటనపై వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాయపాటి



మాట్లాడుతున్న పురుషోత్తమరావు, పక్కన నాయకులు

సత్తెనపల్లి: ముప్పాళ్ల మండలం తొండపి గ్రామంలో వైఎస్సార్ సీపీకి చెందిన ముస్లిం సోదరులపై టీడీపీ రౌడీ మూకలు పథకం ప్రకారం దాడి చేశాయని వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల నుంచి చూశామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కన్నా లక్ష్మీనారాయణ 20 కార్లతో ర్యాలీగా వెళ్లారని, ఆ కారుల్లో కర్రలు, కత్తులు, రాళ్లు తీసుకొని వెళ్లారన్నారు. తొండపి గ్రామంలో కొంత మంది టీడీపీ రౌడీ మూకలతో కలిసి బజారులో రాళ్లు విసురుకుంటూ వెళ్లారన్నారు. మీటింగు జరిగే ప్రదేశం వేరని, గొడవ జరిగిన ప్రదేశం వేరన్నారు. అక్కడ ఉన్నటువంటి ముస్లిం సోదరుల బజారుకు వెళ్లి మీరంతా వైఎస్సార్ సీపీకి సపోర్టు చేయడమేమిటి అంటూ రాళ్లు విసిరారన్నారు. ఈ క్రమంలో జరిగిన దాడిలో వైఎస్సార్ సీపీకి చెందిన ఇరువురు కార్యకర్తలకు గాయాలై సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారన్నారు. ఈ విధమైన భౌతిక దాడులకు దిగడం దురదృష్టకరమన్నారు. ప్రజాక్షేత్రంలో ఎవరి బలం ఏమిటో ఓటు ద్వారా చూసుకోవాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మంచికి ఎవరైనా ఓట్లు వేస్తారన్నారు. స్థానిక శాసనసభ్యుడు, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు 12 సంవత్సరాలుగా గొడవలు, ఘర్షణలను ప్రోత్సహించిన దాఖలాలు ఒకటీ కూడా లేవన్న విషయాన్ని గ్రహించాలన్నారు.

తమ పార్టీ కార్యకర్తలు తప్పు చేసినా ఇది తప్పు అని ముఖాన ఖండించారే తప్ప లాలూచీ వ్యవహారం నడిపి ప్రోత్సహించలేదన్నారు. మంత్రి అంబటి రాంబాబు కావాలనే దాడి చేయించాడని కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడటం దారుణమన్నారు. తొండపి గ్రామంలో మీరే వైఎస్సార్ సీపీ జెండాను విరగగొట్టించినప్పటికీ తాము చూసి చూడనట్లు వ్యవహరించామన్నారు. కన్నా మీరు ఇలాంటివి ప్రోత్సహించుకుంటూ పోతే వచ్చే ఎన్నికల్లో టీడీపీకి డిపాజిట్లు గల్లంతై ఓటమి చవిచూస్తుందన్నారు. సమావేశంలో నాయకులు పక్కాల సూరి బాబు, చల్లంచర్ల సాంబశివరావు, షేక్ నాగుర్ మీరాన్, మద్రి సుబ్బారెడ్డి, చిలుకా జైపాల్ తదితర నాయకులు మాట్లాడారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

తెలుగు తమ్ముళ్లు.. శవ రాజకీయాలు మానుకోవాలి

మాచర్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పల్లపాటి గురుబ్రహ్మం



మాట్లాడుతున్న పల్లపాటి గురుబ్రహ్మం

వెల్దుర్తి: టీడీపీ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి పార్టీ ఉనికిని కాపాడుకునేందుకు శవ రాజకీయాలకు పాల్పడుతున్నాడని మాచర్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పల్లపాటి గురుబ్రహ్మం అన్నారు. సోమవారం మండలంలోని గొట్టిపాళ్ళలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు రోజుల కిందట మండలంలోని బంగారు పెంటకు చెందిన మత్స్యకారుడు ఆత్మహత్యకు పాల్పడితే దానికి పార్టీ రంగు పూసి శవ రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. చేపలు పట్టుకుని జీవించే దుర్గారావుకు పార్టీలతో సంబంధం లేదన్నారు. అక్రమ మద్యం వ్యాపారం చేసి పట్టుబడిన దుర్గారావు టీడీపీ వారు వత్తాసు పలకటం తగదన్నారు. మాచర్ల నియోజక వర్గంలో తెలుగుదేశం పార్టీకి ప్రజల్లో స్పందన లేకపోవటంతో నానా తంటాలు పడి ఎక్కడ ఎవరు చనిపోయినా ప్రభుత్వం పైనా, పోలీసుల పైన, నాయకులు పైన అవాకులు చవాకులు మాట్లాడుతున్నారన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ఇలాంటి చవకబారు చర్యలకు పాల్పడుతున్నారు. శవాలను పోలీసు స్టేషన్ ముందు పెట్టి ప్రజలను రెచ్చగొట్టడం సరి కాదన్నారు. ఇలాంటి చర్యలు పునరావృతమైతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. ప్రజలకు మంచి చేసే విషయాలను వివరించాలని, శవాల మీద చిల్లర ఏరుకునే పనులు చేయవద్దన్నారు. 20 గృహాలున్న కాలనీలో వైఎస్సార్ చేయూత కింద మూడు రోజుల కింద ముగ్గురికి రూ.18,750 మంజూరు చేయించటం జరిగిందన్నారు. కాలనీ వాసులకు ప్రభుత్వం అన్ని రకాల సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. దుర్గారావును పార్టీ మారమని ఒత్తిడి చేయాల్సిన అవసరం లేదనీ, అక్రమ మద్యం వ్యాపారం చేస్తున్న వారిని తెలుగుదేశం నాయకులు ప్రోత్సహించటం మంచి పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో గొట్టిపాళ్ళ సర్పంచ్ మోరబోయిన అచ్చయ్య, మరసపెంట సర్పంచ్ రవీంద్రా నాయక్, ఎంపీటీసీ పోలకం వెంకట నారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వజ్రగిరి చిత్రానికి ప్రథమ బహుమతి



వినుకొండ(నూజెండ్ల): విజయవాడ ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ జాషువా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన చిత్రకళా పోటీల్లో వినుకొండకు చెందిన ప్రముఖ చిత్రకారుడు వజ్రగిరి జెస్టిస్ ప్రథమ బహుమతి సాధించారు. రైతుల ఆక్రందన–మిచాంగ్ తుఫాన్ అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో జెస్టిస్ గీసిన రైతుల ఆక్రందన చిత్రానికి ఈ బహుమతి వచ్చిందని వివరించారు. జెస్టిస్‌ను పలువురు అభినందించారు.

దుర్గారావు మరణంతో పోలీసులకు సంబంధం లేదు

- కేసుని పక్కదారి పట్టించే వారిపై చర్యలు తప్పవు
- హెచ్చరించిన సీఐలు షేక్ షమీముల్లా, పి.శరత్‌బాబు



మాట్లాడుతున్న సీఐలు షేక్ షమీముల్లా, పి శరత్‌బాబు

మాచర్ల రూరల్: చేపల పుట్టిల ద్వారా తెలంగాణ రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యాన్ని తీసుకొచ్చి విక్రయించే కేసులో నిందితుడిగా ఉన్న చొడుపల్లి దుర్గారావు (40) మృతిని రాజకీయం చేస్తూ పోలీసులను పక్కదారి పట్టించే వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్, అర్బన్ సీఐలు షేక్ షమీముల్లా, పి.శరత్‌బాబులు హెచ్చరించారు. సోమవారం రాత్రి విలేకరులతో మాట్లాడుతూ వెల్దుర్తి మండలం మరసపెంట గ్రామానికి చెందిన చొడుపల్లి దుర్గారావు ఆదివారం తెల్లవారుఝామున చేపల వేటకు వెళ్లాడు. అక్కడ మరపడవ తాడు మెడకు చుట్టుకుని తిరగబడి నీళ్లల్లో పడి చనిపోయాడని, తానే నీటిలో నుంచి బయటకు తీసుకొచ్చినట్లు మృతుడి బావమరిది బ్రహ్మాజి తమకు మొదట సమాచారం ఇచ్చాడన్నారు.

నీళ్లలో నుంచి దుర్గారావు మృతదేహాన్ని తీసుకొచ్చేటప్పుడు అక్కడున్న వారు వీడియోను తీశారనీ, బావమరిది బ్రహ్మాజి దుర్గారావు ప్రమాదవశాత్తూ చనిపోయాడని స్వయంగా వివరించారు. విషయం తెలుసుకున్న వెల్దుర్తి ఎస్ఐ శ్రీహరి కేసు పరిశీలనకు వెళ్లగా ఆ ప్రాంతానికి చెందిన టీడీపీ నాయకులు వజ్రం నాయక్, రెడ్యా నాయక్‌లు దుర్గారావు ఉరివేసుకుని చనిపోయాడంటూ తప్పుడు ప్రచారాన్ని సృష్టించి శవానికి మెడకు తాడు చుట్టి ఆత్మహత్యకు పాల్పడినట్లు చిత్రీకరించేందుకు ప్రయత్నించి వెల్దుర్తి పోలీసు స్టేషన్ వద్దకు తీసుకొచ్చి ధర్నా చేశారని వివరించారు. ముందుగా కృష్ణానదిలో నుంచి దుర్గారావు శవాన్ని తీసుకొచ్చేటప్పుడు ఎటువంటి తాడు లేదని, మెడలో గొలుసు కూడా ఉందన్నారు. స్టేషన్ వద్ద ధర్నా చేసేటప్పుడు మెడకు తాడు ఉంచి మెడలో చెయిన్ లేకపోవటం పై ఇది కేవలం రాజకీయంగా పోలీసులను వాడుకొని కేసును పక్కదారి పట్టించే ప్రయత్నం చేయడమేనన్నారు. దుర్గారావు తెలంగాణా హైకోర్టు నుంచి కండీషన్ బెయిల్ తెచ్చుకున్నాడని వివరించారు. పోలీసులకు భార్య ఇచ్చిన రిపోర్టుకు, బావమరిది బ్రహ్మాజి రిపోర్టుకు చాలా తేడా ఉందని, మొదట బ్రహ్మాజి నీళ్లలో పడి చనిపోయినట్లు చెప్పిందన్నా రు. ఆ తరువాత టీడీపీకి చెందిన వ్యక్తులు భార్యపై ఒత్తిడి తీసుకొచ్చి కేసును పక్కదారి పట్టించేందుకు వారికి అనుకూలంగా మార్చినట్లు తెలిసిందన్నారు. విచారణలో కాల్ రికార్డులను పరిశీలిస్తున్నామన్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలతో పాటు బావమరిది బ్రహ్మాజితోనూ విభేదాలున్నట్లు గ్రామస్తుల ప్రాథమిక విచారణలో తెలిసిందన్నారు. ఈ విషయంలో కేసును తప్పుదారి పట్టిస్తూ పోలీసులపై నిందలు మోపుతూ వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా టీడీపీకి చెందిన నాయకులు వ్యవహరించటం సరైన పద్ధతి కాదన్నారు. రాజకీయాల కోసం పోలీసులను వాడుకొనే వారిపై, ఆరోపణలు చేసిన వారిపై విచారణ తరువాత చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే వీడియోలు, ఫొటోలలో ఉన్న వ్యత్యాసాలను విలేకరులకు కంప్యూటర్‌లో చూపించారు. ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారించేందుకు మాచర్ల అర్బన్ సీఐ పి.శరత్‌బాబును ప్రత్యేక అధికారిగా నియమించినట్లు చెప్పారు.

